క్లుప్తంగా

కోడిపందేల స్థావరాలపై దాడులు

కొండాపురం: మండలంలోని ఎర్రబల్లి పంట పొలాల్లో కోడి పందేలు నిర్వహిస్తున్నారని సమాచారం తెలుసుకున్న ఎస్సై షేక్ ఖాజావలి తన సిబ్బందితో ఆదివారం సాయంత్రం దాడి చేశారు. రెండు కోళ్లను స్వాధీనం చేసుకుని, నలుగురు పందేల రాయుళ్లను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.2,100 నగదును స్వాధీనం చేసుకున్నామని ఎస్సై తెలిపారు. వీరిని సోమవారం కోర్టుకు హాజరు పరుస్తున్నట్లు తెలిపారు.

బైక అదుపు తప్పి ఇద్దరికి గాయాలు



క్షతగాత్రులను ఆస్పత్రికి తరలిస్తున్న స్థానికులు

ఆత్మకూరు: బైక్‌పై వస్తుండగా కుక్క అడ్డురావడంతో అదుపు తప్పి పడి ఇద్దరు గాయపడ్డారు. ఈ ఘటన స్థానిక ఆర్టీసీ డిపో సమీపంలో ఆదివారం జరిగింది. బాధితుల వివరాల మేరకు బండారుపల్లికి చెందిన నరసింహులు, పెంచలయ్య గ్రామానికి వెళ్లేందుకు బైక్‌పై వస్తుండగా ప ఈ ప్రమాదం జరిగింది. క్షతగాత్రులను ఆత్మకూరు ప్రభుత్వాస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు.

నేడు రక్తదాన శిబిరం

వరికుంటపాడు: జనవిజ్ఞాన వేదిక వరికుంటపాడు మండల శాఖ ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని పెద్దిరెడ్డిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పచ్చా లక్ష్మయ్య ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆయన కుమారుడు పచ్చ వెంగయ్య నెల్లూరు రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంక్ సహకారంతో జరిగే ఈ రక్తదాన శ/ బిరంలో గ్రామంతో పాటు, పరిసర గ్రామాల రక్తదాతలు పాల్గొని రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని మండలశాఖ నాయకులు కోరారు.

ఆస్పత్రులకు వెళ్లి పింఛన్ల అందజేత



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రమణమ్మకు పింఛన్ అందజేస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్

అల్లూరు: పింఛన్ లబ్ధిదారులు ఆస్పత్రుల్లో వైద్యసేవలు పొందుతుంటే.. వలంటీర్లు జోరు వర్షాన్ని సైతం లెక్క చేయకుండా ఆదివారం సొంత ఖర్చులతో నెల్లూరుకు వెళ్లి పింఛన్లు అందజేశారు. అల్లూరు మండలం ఇస్కపల్లి-1 సచివాలయం పరిధిలోని దర్గిగుంట కృష్ణమ్మ నెల్లూరు ప్రభుత్వాస్పత్రి, సర్వేపల్లి రమణమ్మ లోటస్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇస్కపల్లి-1 సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్ మల్లికార్జున లబ్ధిదారులు చికిత్స పొందుతున్న త్రులకు వెళ్లి ఫింఛన్ అందజేశారు.

ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించాలి



ఓటరు నమోదు కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ మల్లికార్జున

వరికుంటపాడు: మండలంలో బూత్ స్థాయిలో బీఎల్‌ఓలు ప్రతి ఒక్కరికీ ఓటుహక్కు కల్పించే బాధ్యత తీసుకోవాలని తహసీల్దార్ నేలపాటి మల్లికార్జున సూచించారు. ఆయన ఆదివారం మండలంలోని గొల్లపల్లి, పాపన్నగారిపల్లె, విరువూరు తదితర పోలింగ్ కేంద్రాల్లో జరిగిన ప్రత్యేక ఓటరు నమోదు ప్రక్రియను పరిశీలించి సిబ్బందికి సూచనలు, సలహాలు అందించారు. ఓటర్ల జాబితాలోని చనిపోయిన వారి ఓట్లు, శాశ్వతంగా వలస వెళ్లిన వారి ఓట్లు గుర్తించి తొలగించాలన్నారు. సమగ్ర ఓటర్ల జాబితా తయారీకి సహకరించాలన్నారు.

ఆటోవాలాల శ్రమదానం



గుంతలు పూడుస్తున్న ఆటోవాలాలు

ఉదయగిరి: పట్టణంలోని వైఎస్సార్ సర్కిల్ వద్ద రోడ్డుపై ఏర్పడిన గుంతలను ఆదివారం ఆటోవాలాలు శ్రమదానంతో పూడ్చి వేశారు. రోడ్డుపై ఏర్పడిన గుంతలతో ఆటోల రాకపోకలకు, వాహనదారులు, పాదచారులకు ఎంతో ఇబ్బంది ఏర్పడుతుండడంతో గుంతలు పూడ్చి వేశారు. ఈ కార్యక్రమంలో ఆటోవాలాలతో పాటు వైఎస్సార్ సీపీ నాయకులు మట్ల లక్ష్మయ్య, రామయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఉవ్వెత్తున ఎగసిపడుతున్న అలలు



బిట్రగుంట: తుఫాన్ ప్రభావంతో జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ వద్ద నిలిపి ఉంచిన తమిళనాడు బోట్లు

- జువ్వలదిన్నె హార్బర్ వద్ద నిలిచిపోయిన 30 పడవలు
- చిగురుటాకులా వణుకుతున్న మత్స్యకార గ్రామాలు

బిట్రగుంట: తీవ్రవాయుగుండం మిచాంగ్ తుఫాన్‌గా మారడంతో బోగోలు మండలంలోని తీరప్రాంత గ్రామాలు చిగురుటాకులా వణికిపోతున్నాయి. ఆదివారం వేకువ నుంచే సముద్రం అల్లకల్లోలంగా మారింది. తాటిచెట్లపాళెం, పాతపాళెం వద్ద సముద్రంలో అలలు ఉవ్వెత్తున ఎగసిపడుతున్నాయి. అలలతో పాటు గాలుల తీవ్రత కారణంగా తీరంలో హోరుగాలితో భయానకంగా మారింది. సముద్రంలో కసురు పెరగడం, అలల ఉధృతి అంతకంతకూ పెరుగుతుంది. దీంతో సముద్రంలో వేట సాగిస్తున్న సుమారు 30 తమిళనాడు పడవలను ముందస్తు జాగ్రత్తగా బోట్ల యజమానులు జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ వద్ద నిలిపేశారు. స్థానిక మత్స్యకారులు కూడా తమ వలలు, పడవలను తీరానికి దూరంగా తరలించి భద్రపరుచుకుంటున్నారు. వాతావరణ మార్పులతో తీరప్రాంత గ్రామాలైన బంగారుపాళెం, కొత్తబంగారు పాళెం, పాత బంగారు పాళెం, అలిచెర్లబంగారుపాళెం, తాటిచెట్లపాళెం, కడపాళెం, కొత్తకడపాళెం, టెంకాయచెట్లపాళెం, తదితర గ్రామాల్లో ఆందోళన నెలకొంది. మధ్యాహ్నం 3 గంటల నుంచి అలల ఉధృతి మరింత అధికమవడం, చలితీవ్రత అనూహ్యంగా పెరగడంతో మత్స్యకారులు వణికిపోతున్నారు. అధికారులు ముందస్తు జాగ్రత్తగా తీరప్రాంత గ్రామాల్లో ప్రత్యేకాధికారులను అందుబాటులో ఉంచి పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. మరో వైపు ఉదయం నుంచి చెదురుమదురు జల్లులు తప్ప చెప్పుకోదగ్గ స్థాయిలో వర్షపాతం నమోదు కాలేదని అధికారులు తెలిపారు.

పొంచి ఉన్న ప్రమాదం

తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు కురిస్తే తీరానికి ప్రమాదం పొంచి ఉంది. భారీ వర్షాల కారణంగా ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వరద సముద్రంలో కలిసే పరిస్థితులు లేకపోవడం, పంట పొలాలను రొయ్యల గుంతలుగా మార్చి ఎత్తుగా కట్టలు వేయడంతో వరద నీరు రోడ్లను ముంచెత్తి తీరానికి రాకపోకలు స్తంభించి పోయే పరిస్థితి ఉంది. మరో వైపు రొయ్యల గుంతల వద్ద కాపలాగా ఉంటున్న కుటుంబాలను ఇప్పటి వరకు సుర క్షిత ప్రాంతాలకు తరలించకపోవడం, కనీసం వారి వివరాలు కూడా సేకరించకపోవడం ఆందోళన కలిగిస్తోంది. గతంలో కూడా స్థానిక పోలీసులు అధికారులు, ఎన్డీఆర్‌ఎఫ్ బృందాలు పడవల్లో వెళ్లి గుంతల వద్ద ఇరుక్కుపోయిన కుటుంబాలను కాపాడిన సందర్భాలు ఉన్నాయి.

లోతట్టు ప్రాంతాల్లో ఆర్డీఓ పర్యటన

- ముందు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచన

ఆత్మకూరు: తుఫాన్ నేపథ్యంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, అధికారులు అప్రమత్తంగా ఉండి ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని ఆత్మకూరు ఆర్డీఓ కె.మధులత చెప్పారు. మున్సిపల్ పరిధిలోని పలు లోతట్టు ప్రాంతాల కాలనీలను మున్సిపల్ కమిషనర్ బి నాగేశ్వరరావుతో కలిసి పరిశీలించారు. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు తోడు తుఫాన్ తీవ్రంగా ఉండనుందని హెచ్చరికలు వస్తుండడంతో జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆదివారం ఆమె పట్టణంలోని మోడల్ ఎస్టీ కాలనీ, వెంకట్రావుపల్లి గిరిజనకాలనీ, సెయింట్‌మేరీస్ పాఠశాల ఎదురు గిరిజన కాలనీ, తదితర ప్రాంతాల్లో పరిశీలించారు. మోడల్ ఎస్టీ కాలనీ సమీపంలో ఆత్మకూరు చెరువు ఉండడంతో ఆ ప్రాంతంలో నీరు నిలిచే పరిస్థితి ఉన్న విషయం తెలుసుకుని తగు జాగ్రత్తలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. తుఫాన్ ప్రభావం అధికంగా ఉంటుందన్న సమాచారంతో వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు అందుబాటులో ఉండి అత్యవసర వైద్యసేవలు అందించాలని ఆమె ఆదేశించారు. విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ తీగలను పరిశీలిస్తూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్‌శాఖ ఏఈ మన్మథరావు, మున్సిపల్ ఆర్‌ఐ ఖాసీం, వైద్యశాఖ సిబ్బంది, పలువురు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సురక్షిత ప్రాంతాలకు వెళ్లండి

సోమశిల: మిచాంగ్ తుఫాను కారణంగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల్లో నివాసముండే ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని ఆత్మకూరు ఆర్డీఓ కురబ మధులత అన్నారు. ఆదివారం మండలంలోని దేవరాయపల్లి బిట్-1, రేవూరు గ్రామాల్లోని ఎస్సీ, ఎస్టీ కాలనీలను సందర్శించారు. అక్కడ పూరిగుడిసెల్లో నివాసముంటున్న ప్రజలతో మాట్లాడారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు వెళ్లాలని సూచించారు. ఆమె వెంట తహసీల్దారు సుభాషిణి, వీఆర్‌ఓ శ్రీను తదితరులు ఉన్నారు.

రెవెన్యూ యంత్రాంగం అప్రమత్తం

ఆత్మకూరురూరల్: తుఫాన్ నేపథ్యంలో రెవెన్యూ యంత్రాంగం ముందస్తు జాగ్రతలు తీసుకుంటుందని తహసీల్దారు జగదీష్‌బాబు తెలిపారు. ఆదివారం ఆయన మండలంలోని ప్రభావిత గ్రామాల్లో రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖల సమన్వయంతో ఎలాంటి ఆస్తి నష్టం జరగకుండా తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆత్మకూరులోని పాలిటెక్నిక్ కళాశాలలో పునరావాస కేంద్రం ఏర్పాటు చేశామని, అవసరమైన వారికి అక్కడ ప్రభుత్వం తరఫున సురక్షితమైన ఏర్పాట్లు చేస్తామన్నారు. మండలంలోని బండారుపల్లి, అప్పారావుపాళెం పెన్నాపరీవాహక గ్రామాల పరిధిలో రెవెన్యూ పంచాయతీ రాజ్, విద్యుత్ శాఖల సిబ్బంది జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నారు.

డివిజన్‌లో 90.4 మి.మీ. వర్షపాతం

ఆత్మకూరు: ఆత్మకూరు రెవెన్యూ డివిజన్ పరిధిలో గడిచిన 24 గంటలకు ఆదివారం ఉదయానికి 90.4 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు ఆర్డీఓ కార్యాలయ అధికారులు తెలిపారు. అత్యధికంగా కలువాయి మండలంలో 20.8, ఆత్మకూరు 16.4, చేజర్ల 15.2, సంగంలో 11.6, అనంతసాగరం 10, ఉదయగిరి 5.2, సీతారామపురం 7.2, ఏఎస్‌పేటలో 7.2, మర్రిపాడులో 1.2 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు వివరించారు.

వరికుంటపాడులో..

వరికుంటపాడు: తుఫాన్ ప్రభావంతో మండలంలో ఆదివారం మధ్యాహ్నం నుంచి వర్షం కురుస్తోంది. రెవెన్యూ, పోలీస్ పంచాయతీరాజ్, వ్యవసాయ తదితర శాఖల అధికార యంత్రాంగం ప్రజలను అప్రమత్తం చేసింది. అధికారులు ఎప్పటికప్పుడు సమాచారం సేకరిస్తున్నారు. రాత్రి నుంచి వర్షం ఉధృతి పెరిగే అవకాశం ఉంటుందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తహసీల్దార్ ఎస్.మల్లికార్జున గొల్లపల్లి ఎస్సీకాలనీ లోతట్టు ప్రాంతాన్ని సందర్శించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

పెన్నా పరీవాహక గ్రామాల్లో దండోరా

చేజర్ల: భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పెన్నా పరీవాహక గ్రామాల్లో దండోరా వేయించి, రెవెన్యూ అధికారులు, సిబ్బందిని అందుబాటులో ఉంచామని తహసీల్దార్ పి.కృష్ణ తెలిపారు. ముందస్తు జాగ్రత్తలు చేపట్టామని చెప్పారు. పశువుల కాపరులు నీరు ఎక్కువగా ఉండే ప్రదేశాల్లోకి పోవద్దన్నారు. అత్యవసర పరిస్థితుల్లో కంట్రోల్ రూమ్ 9989931808 నంబర్‌కు కాల్ చేయాలన్నారు.

చిరు జల్లులు

మిచాంగ్ తుఫాన్ కారణంగా మండలంలో ఆదివారం తెల్లవారుజాము నుంచి చిరు జల్లుతో కూడిన వర్షాలు కురుస్తున్నాయి. ఈ వర్షానికి తోడు చలి గాలులు వీడయడంతో చలి తీవ్రత పెరిగింది.

సంగంలో..

సంగం: తుఫాన్ కారణంగా మండలంలో ఆదివారం జోరు వర్షం కురిసింది. పలు లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచింది. తహసీల్దారు నాగరాజు, అధికారులు, ప్రజా ప్రతినిధులు లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేశారు. సంగం బ్యారేజ్ వద్ద నీటిమట్టాన్ని పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. పెన్నాపరీవాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసరమైతే తప్పా బయట ప్రయాణాలు చేయొద్దని సూచించారు. వీర్లగుడిపాడు గ్రామంలో పర్యటించి వర్షాలు ఎక్కువగా కురుస్తున్నందున పెన్నానదికి నీటి ప్రవాహం వస్తే పరీవాహక ప్రాంతాలు జలమయం అవుతాయని, ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని చెప్పారు.



లోతట్టు గిరిజనకాలనీలో ఓ కుటుంబంతో మాట్లాడుతున్న ఆర్డీఓ, ఇతర అధికారులు



సంగం: వీర్లగుడిపాడులో ప్రజలతో మాట్లాడుతున్న తహసీల్దారు నాగరాజు



ఆత్మకూరు రూరల్: బట్టేపాడులో వర్షానికి వీధుల్లో నిలిచిన నీరు



వరికుంటపాడు: ప్రజలతో మాట్లాడుతున్న తహసీల్దార్ మల్లికార్జున

పేదల అభ్యున్నతికి కేంద్ర ప్రభుత్వ పథకాలు

మర్రిపాడు: పేద ప్రజల అభ్యున్నతికి కేంద్రం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశ పెడుతుందని, ఈ పథకాలతో ప్రజలందరూ ఎంతో ఆనంతంగా ఉన్నారని బీజేపీ ఆత్మకూరు నియోజకవర్గ కన్వీనర్ కంది మల్లికార్జునరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని చుంచులూరు, పడమటినాయుడుపల్లిలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని ఎంపీడీఓ నాగమణి, ప్రభుత్వ ఉద్యోగస్తులు నిర్వహించారు. అర్హులకు ఈ సంక్షేమ పథకాలన్నింటిని అందజేయాలనే లక్ష్యంతో వికసిత్ భారత్ కార్యక్రమం చేపట్టామని వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఉద్యోగులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో ఆయుష్మాన్ కార్డులు అందజేస్తున్న కంది మల్లికార్జునరెడ్డి

కొరిమెర్లలో..

సంగం: మండలంలోని కొరిమెర్లలో ఆదివారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం ప్రజలకు అందజేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. అనంతరం ఆయుష్మాన్ భారత్ కార్డులను పలువురు లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఓ శ్రీహరి, హౌసింగ్ ఏఈ కరిముల్లా తదితరులు ఉన్నారు.

ఘనంగా గంధమహోత్సవం

మర్రిపాడు: మండలంలోని నందవరంలో హజరత్ సయ్యద్ షాసర్‌తాజ్ ఆలీషాఖాదరి స్వామి 11వ గంధమహోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. దర్గా పీఠాధిపతి హజరత్ ఖాజా సయ్యద్ షాసాని తురాజ్ ఆలీషా ఖాదరి గంధ కలశాన్ని గృహం నుంచి ఫకీర్ల డప్పుల సందడితో దర్గా వద్దకు తీసుకు వచ్చి సమాధికి పూసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. భక్తులకు గంధ ప్రసాదాన్ని పంచారు. అనంతరం దర్గా ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.



సమాధి వద్ద ప్రార్థనలు చేస్తున్న దర్గా పీఠాధిపతి తదితరులు

లక్ష్మయ్య సేవలు చిరస్మరణీయం

వరికుంటపాడు: మండలంలోని పెద్దిరెడ్డిపల్లికి చెందిన పచ్చవ లక్ష్మయ్య విద్యాభివృద్ధికి చేసిన సేవలు చిరస్మరణీయం. ఆయన పెద్దిరెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఏర్పాటులోనూ విశేష కృషి చేసి కార్పస్ ఫండ్‌కు సొంత నిధులు వెచ్చించారు. పలువురు విద్యా వలంటీర్లను సొంత ఖర్చులతో నియమించి విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించారు. 1990లో పాఠశాల ఆవరణలో సరస్వతీ విగ్రహం సొంత నిధులతో ఏర్పాటు చేయించారు. పర్యావరణ పరిరక్షణ కోసం గ్రామంలో మొక్కల పెంపకాన్ని ప్రోత్సహించి ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చారు. పదో తరగతిలో మంచి ప్రతిభ కనపరచిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేసి వారిలో ఉత్సాహం నింపారు. పెద్దిరెడ్డిపల్లి పక్కనే ఉన్న పెదరాజుపాళెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో సొంత నిధులతో సరస్వతీ విగ్రహ మండపం, కళాప్రాంగణం నిర్మించి పాఠశాల అభివృద్ధికి విశేష కృషి చేశారు. మండలంలోని పలు ఉన్నత పాఠశాలల విద్యార్థులకు ఉచితంగా నోటు పుస్తకాలు అందజేశారు. పేద విద్యార్థులకు ఆర్థికంగా సహాయం అందించి వారి ఎదుగుదలకు ఎంతగానో సహకారం అందించారు. రెడ్‌క్రాస్ సహకారంతో రక్తదాన శిబిరాలు నిర్వహించి రక్తదానంపై ప్రజలకు అవగాహన కల్పించి ఉన్నతమైన వ్యక్తిత్వాన్ని చాటుకున్నారు.



ప్రతిభ చూపిన విద్యార్థులకు నగదు అందజేస్తున్న లక్ష్మయ్య (ఫైల్)

ప్రత్యేక ఓటర్ల నమోదు పరిశీలన

సోమశిల: ప్రత్యేక ఓటర్ల నమోదును ఆర్డీఓ మధులత పరిశీలించారు. తొలుత అనంతసాగరం తహసీల్దారు కార్యాలయాన్ని సందర్శించారు. ఓటర్ల జాబితా పూర్తిగా పరిశీలించి వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు.

ఆడుదాం ఆంధ్రాకు రిజిస్టర్ చేసుకోండి

సోమశిల: గ్రామీణ ప్రాంతాల్లో ఆసక్తి ఉన్న క్రీడాకారులు ఆడుదాం ఆంధ్రాకు రిజిస్టర్ చేసుకోవాలని ఎంఈఓ కాటంరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని కామిరెడ్డిపాడు, బొమ్మవరం సచివాలయాల పరిధిలో ఆడుదాం ఆంధ్రాకు రిజిస్ట్రేషన్లు చేస్తున్న గ్రామ వలంటీర్ల పని తీరును ఆయన పరిశీలించారు. అనంతరం మినగల్లు, రేవూరు, ఇస్కపల్లి పోలింగ్ కేంద్రాలన పరిశీలించి ఓటరు జాబితా ప్రక్రియ వివరాలను బీఎల్‌ఓలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట రిసోర్స్‌పర్సన్ సురేష్‌కుమార్, సీఆర్‌పీ మాధవ్ తదితరులు ఉన్నారు.



కామిరెడ్డిపాడులో సిబ్బందితో మాట్లాడుతున్న ఎంఈఓ ప్రభాకర్‌రెడ్డి

వాహనచోదకులు జాగ్రత్త వహించండి

- ఎం.రాములు, ఎంవీఐ

ఆత్మకూరు: తీవ్రమైన తుఫాన్ వర్షాల నేపథ్యంలో ద్విచక్ర వాహనదారులు ప్రయాణంలో జాగ్రత్త వహించాలని ఎంవీఐ ఎం.రాములు సూచించారు. ఆదివారం ఆయన విలేకరుతో మాట్లాడుతూ మూడు రోజులు భారీ వర్షాలు కురుస్తాయనే హెచ్చరిలకల నేపథ్యంలో ద్విచక్ర వాహనదారులు ఇద్దరు కంటే ఎక్కువ ప్రయాణించరాదని, ప్రయాణాలు తగ్గించుకోవాలని సూచించారు. గొడుగు వేసుకుని వాహనాలపై ప్రయాణిస్తే ఎదురుగాలికి ప్రమాదాలు జరిగే పరిస్థితి సంభవిస్తుందని హెచ్చరించారు. కార్లలో ప్రయాణించేవారు సీటు బెల్టు తప్పనిసరిగా ధరించాలన్నారు. తుఫాన్ సమయంలో రాత్రి వేళలో ప్రయాణం చేయరాదన్నారు.



మాట్లాడుతున్న ఎంవీఐ రాములు

కాంగ్రెస్ సంబరాలు

ఆత్మకూరు: తెలంగాణలో కాంగ్రెస్ విజయం సాధించడంతో ఆ పార్టీ నాయకులు, నియోజకవర్గ ఇన్‌చార్జి చేవూరి శ్రీధర్‌రెడ్డి నేతృత్వంలో ఆదివారం సాయంత్రం సంబరాలు చేశారు. యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు వన్నం నాగరాజు పార్టీ కార్యాలయం ఎదుట బాణసంచా కాల్చి మిఠాయిలు పంచి పెట్టారు. గంగపట్ల రాంకీ, మస్తానయ్య, రసూల్, వేణు, బషీర్ తదితరులు పాల్గొన్నారు.

ఉదయగిరి: తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడంతో స్థానిక నాయకులు పంచాయతీ బస్టాండ్ సెంటర్‌లో బాణసంచా పేల్చి, మిఠాయిలు పంచి పెట్టి సంబరాలు జరుపుకున్నారు. నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకుడు సోము అనిల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ రాహుల్‌గాంధీ చేపట్టిన జోడో యాత్ర ఫలితంగా కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ విజయదుందుబి మోగించిందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.